తాగేందుకు కాస్త బ్రేక్ ఇచ్చింది.

''ప్రస్తుతం నాదీ అదే పరిస్థితి చెల్లెమ్మా! నాకూ పిల్లల దగ్గరి నుంచి పిలుపువచ్చింది. మీ బావగారికైతే నేను వెళ్లడం అసలే ఇష్టం లేదు. 'కనీసం ఈ వయసులో అయినా మనం కలిసి ఉండకపోతే ఎలా!?' అంటూ నన్నే తిడుతున్నారు. ఏం చేయాలో అర్థం కావట్లేదు. నిజం చెప్పాలంటే నాక్కూడా వెళ్లేందుకు మనసు ఒప్పుకోవట్లేదు. అన్నన్ని నెలలు మీ బావగారిని ఒంటరిగా వదిలి అక్కడ నాలుగు గోడల మధ్య ఉండాలంటే బాధగా ఉంది. కానీ పిల్లలు అర్థం చేసుకోరుగా మన బాధ'' మధురమ్మకు బెంగగా ఉంది.

''ఏం పిల్లలక్కా. అమెరికా నుంచి వాళ్లు ఇక్కడికి వచ్చినా మనకే పని. మనం అక్కడికి వెళ్లినా మనకే పని. ఏం.. మనకు మాత్రం పనుల నుంచి విరామం వద్దా. మనకేమన్నా రోబోలు ఉన్నాయా లేక మనమే మెషిన్లమా!?'' అంటున్న వర్ణమ్మ మాటలు విన్నారు అప్పుడే లోపలికి వస్తున్న కృష్ణలీలయ్య.

''ఏమ్మా! అమెరికాకు వెళ్లొచ్చావు. ప్రెసిడెంటును కలిశావా లేదా? కనీసం ఒక చాక్లెట్ ముక్కయినా తెచ్చావా లేదా నాకు..'' అని ఏడిపించారు.

''అయ్యో రామా! మనం తీసుకువెళ్లడమే కానీ మనతో ఏమన్నా పంపిస్తారా ఏంటీ!? అందుకే చెప్పేసి వచ్చాను.. నేనింకోసారి ఈ చాకిరీ కోసం రానని'' నవ్వుతూ అంది వర్ణమ్మ.

''ఆ బుద్ధి ఈ జన్మలో మీ అక్కగారికి వచ్చేలా లేదమ్మా'' అని భార్యను గుర్రుగా చూస్తూ లోపలికి వెళ్లిపోయాడు.

''చూశావా! ఎంత కోపంగా ఉన్నారో. ఇప్పుడు పిల్లలకు నేను ఏం చెప్పాలి. నాన్నకు నన్ను పంపడం ఇష్టం లేదు అంటే ఆయనపై కోపం పెంచుకుంటారు. నాకు పిచ్చెక్కుతోంది అనుకో'' అని వర్ణమ్మతో తన గోడు వెళ్లబోసుకుంది.

''ఈమధ్య ఇది ఇంటింటి రామాయణంగా మారింది. ఏదో ఒకటి నువ్వే ఆలోచించుకో'' అంటూ వర్ణమ్మ వెళ్లిపోయింది.

* * *

''ఏమిటోయ్ ఇంకా అమెరికా ప్రయాణానికి సిద్ధం కావట్లేదేంటీ?'' అని భార్యను ఉడికించాడు కృష్ణలీలయ్య.

''నాకన్నా మీకే తొందర ఎక్కువగా ఉన్నట్టుందిగా'' అంది భర్తను ఓరకంట కనిపెడుతూ.

''అరే.. ఈ పాటికి నీ సంతానం 'ఇవి గ్రైండు చేసుకుని తీసుకురా! అవి షాపింగు చేసి కొనుక్కురా! ఈ

**పిల్లలూ.. మీ నుంచి ఒకే ఒక్కటి ఆశిస్తున్నాను. ఇప్పుడైనా.. మమ్మల్ని కలిసి ఉండనివ్వండి. మీ అవసరాల కోసం మా ఇద్దరినీ విడదీయకండి. మీకు కాన్పులు ఉంటే తప్పకుండా అమ్మగా ఆమె వచ్చి బాధ్యతను తీసుకుంటుంది. కానీ ఆమె మనసు మాత్రం నాపైనే ఉంటుంది. నేనేం తిన్నానో, మందులు గట్రా సరైన సమయానికి వేసుకున్నానో లేదోనని ఆరాటపడుతూనే ఉంటుంది. అందుకే ఒకే ఒక్క విన్నపం!**

పచ్చళ్లు, ఆ పొడులు..' అంటూ లిస్టు పంపుతారు కదా.. ఇంకా రాలేదా అని ఆత్రుత అంతే!'' అని చటుక్కున నోటిపై వేలేసుకుని భార్య ఏమంటుందోనని చూశారు.

''మీరు ఊరుకోండి. అరే.. 'మన అమ్మానాన్నే కదా!?' అని అలా చెబుతారు. దానికే ఓ.. ఇదైపోతే ఎలా? అయినా వాళ్లు అడిగినా అడగకపోయినా తీసుకువెళ్లడం నా బాధ్యత. ఓపిక ఉన్నంతవరకూ చేస్తూనే ఉంటాను'' అంటూ లోపలికి వెళ్లిపోయింది.

భార్య మనసు అటు భర్త.. ఇటు పిల్లలమధ్య ఎంతలా కొట్టుకుంటుందో కృష్ణలీలయ్యకు అర్థమయ్యింది.

వెంటనే పిల్లలకు ఒక ఆడియో మెసేజీ పంపించాడు.

'పిల్లలూ.. మీరంతా మీమీ దేశాల్లో బిజీ అని నాకు తెలుసు. మీకు వీలు ఉన్నప్పుడు ఈ ముసలాడి మెసేజీ వింటారని ఆశిస్తున్నాను. మాకు పెళ్లయినప్పటి నుంచి కుటుంబ బాధ్యతలు, ఉద్యోగరీత్యా మీ అమ్మా, నేను ఎన్నోఏళ్లు దూరంగా ఉన్నాం. దూరంగా ఉన్నా ఒకరి గురించి ఒకరం ఆలోచిస్తూ.. సరిగ్గా తినీతినక అవస్థలు పడ్డాం. ఎన్ని పస్తులున్నామో.. ఎంత ఒంటరితనం అనుభవించామో మాకే తెలుసు. అందరు తల్లిదండ్రుల్లానే మేము కూడా పిల్లల భవిష్యత్తు గురించే ఆలోచించాం. వాటికి త్యాగాలు, సేవలు అన్న పెద్దపేరు పెట్టలేను కానీ.. మా జీవితాన్నంతా మీకోసమే ధారబోశాం. నేనంటే ఇప్పుడు రిటైరయ్యాను కానీ.. మీ అమ్మ మాత్రం ఇంకా మీ డెలివరీలు, పురుళ్లు అనుకుంటూ శ్రమిస్తూనే ఉంది. అది ఆమె బాధ్యత అంటూ మీరు హుకుం జారీ చేస్తున్నారు. పిల్లలుగా మాపై మీకా హక్కు ఉంది. కానీ, మాకూ కొన్ని ఇష్టాయిష్టాలు ఉంటాయని మీకెందుకు అనిపించడం లేదు. మాకు ఈ వయసులో ఒకరికొకరి తోడు కావాలి. మా వృద్ధాప్యంలో మా కబుర్లను విని, సమయానికి మందులు వేసే ఒక మనిషి కావాలి.

అది.. అమ్మకు నేను. నాకు అమ్మ.

పిల్లలూ.. మీ నుంచి ఒకే ఒక్కటి ఆశిస్తున్నాను. ఇప్పుడైనా.. మమ్మల్ని కలిసి ఉండనివ్వండి. మీ అవసరాల కోసం మా ఇద్దరినీ విడదీయకండి. మీకు కాన్పులు ఉంటే తప్పకుండా అమ్మగా ఆమె వచ్చి బాధ్యతను తీసుకుంటుంది. కానీ ఆమె మనసు మాత్రం నాపైనే ఉంటుంది. నేనేం తిన్నానో, మందులు గట్రా సరైన సమయానికి వేసుకున్నానో లేదోనని ఆరాటపడుతూనే ఉంటుంది. అందుకే ఒకే ఒక్క విన్నపం! ఈ ముసలాడిని కూడా అమ్మతో రానివ్వండి. మీ దగ్గర నాన్న టికెట్టుకు డబ్బులేకుంటే.. అప్పో సొప్పో చేసుకుని నేనే టికెట్టు కొనుక్కుంటాను. అక్కడ మీ ఇంట్లో నేను ఉన్నన్ని రోజులు మీకు ఎంత ఖర్చు అవుతుందో చెబితే.. అది కూడా ఇచ్చుకుంటాను. మీకు భారం కాను. కానీ, దయచేసి ఈ వయసులో మమ్మల్ని విడదీయకండి. ఇది తండ్రిగా నా ఆఖరి కోరిక అనుకోండి!'.. అని ముగించాడు.

కానీ, ఈ విషయాన్ని భార్యకు చెప్పలేదు. పిల్లలు కచ్చితంగా మారతారని మాత్రం భావించాడు. పిల్లల నుంచి మెసేజీ కోసం ఎదురు చూడసాగాడు.

అతను ఊహించినట్టుగానే.. తండ్రి నుంచి వచ్చిన మెసేజీని చూసి పిల్లలు చలించిపోయారు. చిన్నప్పుడు అమ్మానాన్నలు తమకోసం పడ్డ కష్టాలు వారికి గుర్తొచ్చాయి. అమ్మానాన్న వయసులో ఉండగా.. ఎప్పుడూ సుఖపడ్డది లేదు. ఎప్పుడూ తమ కోసం, తమ చదువు కోసం తాపత్రయపడ్డారు. ఇప్పుడు తాము కేవలం కొంత డబ్బును మిగుల్చుకునేందుకు నాన్నకు టికెట్ తీయకుండా అమ్మకు మాత్రమే టికెట్ కొనడం ఎంత నీచపు చర్యో అర్థమై వారికి సిగ్గేసింది. అమ్మను కూడా ఎప్పుడూ డెలివరీల సమయంలో చాకిరీ చేయడానికే పిలిచారు తప్ప.. ఒక హాలీడే ట్రిప్‌లా ఎంజాయ్ చేయడానికి ఎప్పుడూ పిలవలేదని గుర్తొచ్చి గుండె మెలేసింది. తమ తప్పును తెలుసుకున్న పిల్లలు వెంటనే అమ్మానాన్నలిద్దరికీ టికెట్లు పంపించారు. తండ్రికి ఫోన్ చేసి క్షమాపణలు కోరారు. తాము తమ తప్పును తెలుసుకున్నామని మరోసారి ఈ విధంగా చేయమని చెప్పుకొచ్చారు. ఇద్దరికీ టికెట్లను పంపుతున్నామని.. ఇకపై ఎప్పుడూ విదేశాలకు వచ్చినా అమ్మానాన్నలు కలిసే వచ్చేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఇది విన్న కృష్ణలీలయ్య కళ్లు చెమర్చాయి.

మరుసటి రోజు ఉదయం భార్య ఎంతో ఉత్సాహంగా ఉండటం గమనించాడు కృష్ణలీలయ్య.

''ఏమండీ ఏమండీ.. ఇదిగోండి ఇటు చూడండి. మీకూ, నాకు ఇద్దరికీ టికెట్లు పంపారండీ మన పిల్లలు. మీరేమో వెళ్లొద్దని నన్ను కట్టడి చేశారు. మన పిల్లలేమో మన గురించే ఆలోచించారు. మన పెంపకం అలాంటిది'' అంటూ అసలు విషయం తెలియక పొంగిపోయింది.

''అవునా.. నాన్నకు కూడా టికెట్ పంపారా!?'' అంటూ కృష్ణలీలయ్య చిరునవ్వు నవ్వుతూ టిక్కెట్లను ప్రేమగా తడిమి.. భార్య భుజంపై చేయి వేశాడు. ■

## మంజీత కుమార్



విదేశాల్లో అమ్మాయి డెలివరీ అనగానే.. అమ్మలను మాత్రమే తీసుకెళ్తారు. నాన్నలను ఎందుకు తీసుకెళ్లరు? అన్న ఆలోచనలోంచి ఈ కథను రాశారు రచయిత్రి మంజీత కుమార్. వీరి స్వస్థలం హైదరాబాద్. ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఫిల్ (జర్నలిజం) చేశారు. 'ఆడియో ఆప్స్ రైటర్'కు ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. వివిధ యూట్యూబ్ చానెల్స్‌కు కథలు, మాటలు అందించడంతోపాటు ఆకాశవాణి రేడియోకు నాటకాలు రాస్తుంటారు. ఆకాశవాణి, ఎఫ్ఎం రేడియోల్లోనూ పనిచేశారు. మూడున్నరేళ్లుగా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో కథలు, కవితలు రాస్తున్నారు. కుక్కర్, క్షమయా ధరిత్రీ కథలు పాఠకుల మన్ననలు పొందాయి. 'నాగ మంజీతం' వీరి తొలి నవల. 'తపస్వి మనోహరం' సంస్థ తరఫున నిర్వహించిన నవలల పోటీల్లో ప్రథమ బహుమతితోపాటు రూ.5000 గెలుచుకున్నది. రెండుసార్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు సంపాదించుకున్నారు. వంశీ గ్లోబల్ అవార్డ్‌తోపాటు గాథ సృజన సంయమి పురస్కారం, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ సేవా పురస్కారంలాటి అనేక అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు.